# మనసు తీరింది

రావెల సాంబశివరావు




"రాగమయీ, అనురాగమయీ, కాంతీ!"

ఉలిక్కిపడింది సూర్యకాంతమ్మగారు. ఆ వూళ్ళో ఆమె నోటికి దడవని వాళ్ళుంటే ఒట్టు. స్వయంగా భర్తే ఒక వేళ అలా అన్నా మతి చలించిందేమోనని వెంటనే డాక్టరు వద్దకు లాక్కుపోగలదు. అలాంటి సూర్యకాంతమ్మగారికి మరి ఇలాంటి సంబోధనతో ఉత్తరం చూస్తే వొళ్ళు మండిపోదూ ? ఏకధాటిగా నోటివెంట తిట్లు గుమ్మరించదూ ?

"వీడికేం పోయేకాలం? ఏదో కొంచెం అందంగా వుంటే మాత్రం యాభై ఏళ్ళొచ్చిన నాకు ప్రేమలేఖ వ్రాస్తాడూ? ఎన్ని గుండెలు వీడికి? వీడి నోట నక్సలైట్లు తుపాకి గొట్టం కొట్టా"

"ఈ వయసులో ఇలాంటి ఉత్తరం సహజంగా ఎవరికయినా కోపం కలిగిస్తుందని నాకు తెలుసు."

తెలుసా! తెలిసి కూడా వ్రాస్తాడూ? అందులో పైగా ఏకవచన ప్రయోగం.

వీణ్ణి వెంటనే శ్రీకృష్ణ జన్మస్థానానికి పంపవలసిందే."

"అయినా నీ మీద నాకున్న అపారమైన ప్రేమ నాచేత ఈ లేఖ వ్రాయిస్తూంది."


వ్రాయిస్తుంది. వ్రాయిస్తుంది. వీపు వాయించే వాళ్ళు లేకపోతే సరి. అయినా అసలు యింట్లో మగవాణ్ణి అనుకోవాలి. ఊళ్ళో వాళ్ళంతా మహేశ్వరంగారు మహానుభావుడనుకుంటున్నారని దుబ్బు మీసంలోంచి వచ్చీరాని నవ్వు నవ్వుతుంటే సరిపోయిందా? మగవాడంటే సింహస్వప్నంగా వుండొద్దూ? సరయిన మగవాడే భార్యకు మరొకడు ఉత్తరం వ్రాయటమే? అసలు ఈ మనిషిని రానీ చెప్తాను....

"పెళ్ళయిన క్రొత్తలో కాంతం అని పిలిస్తే అపచారం, అపచారం అని తాళి కళ్ళ కద్దుకొని భర్త ఆయుష్షు పెంచాలని అమాయకంగా పడిన తాపత్రయం నేనెరుగనిది కాదు."

ఓరి వీడి గుడ్లు పీకి అరిచేతిలో పెట్టా. మొగుడూ, పెళ్ళాల మధ్య మాటలు కూడా వీడు కూపీ లాగుతున్నాడు. పాతికేళ్ళనాటి మాట జ్ఞాపకాల పొరల్లోంచి దూసి తెస్తున్నాడు. మా మధ్య మాటలు వీడికెలా తెలిసుంటాయబ్బా. ఈయనగారొకడు ఇంట్లో విషయాలన్నీ వీధిలో వేస్తాడు. అసలు ఈ మనిషి ననుకోవాలి.

"భార్యాభర్తలమధ్య ఎంత అనురాగమున్నా అప్పుడప్పుడూ స్వల్పమైన ఎడబాటు అవసరం."

నా చిట్టి తండ్రే. ఎంత ఆశ నీకు. ఏం నాయనా మధ్యలో కాస్త సందు చేసుకుందామనా? నాకు పెళ్ళయి ముప్పై ఏళ్ళు. ఒక్కనాడయినా ఈయన్ని వొదలి వున్నానా? నాతో ఆయనో, ఆయనతో నేనో ఏవూరెళ్ళినా కలిసి వెళ్ళవలసిందే. ఏమో ఆయన్ని ఒంటరిగా వదలి వెళ్ళాలన్నా.




ఆయన్ని ఒంటరిగా పంపాలన్నా నాకు భయమే. ఎవరి కళ్ళు ఎలాంటివో? అరవయ్యోపడి దగ్గరపడ్డా ఇంకా పెళ్ళికొడుకులా వుండే ఆయన్ని చూస్తే ఎవరి బుద్ధికి ఏం జబ్బొస్తుందో. ఏదో నాది కాస్త నోటి దురుసుతనమే కాని ఆయనంటే ఎంత పడి చస్తానో ఆయనకేం తెలుసు. ఎన్నడూ లేంది ఆయన వొంటరిగా అమ్మాయిగారింటికి వెళ్ళటం. ఈ మాయదారి వుత్తరం నాకు రావడం."

"నాకు తెలుసు నీకు భర్తపట్ల ఎంత గాఢమైన ప్రేమ వున్నదీ."

మరి అంత తెలిసినవాడికి ఇదేం పోయేకాలం. వేళాకోళంగా వుంది కాబోలు. ఈ సూర్యకాంతమ్మ తడాఖా వీడికింక తెలిసినట్లు లేదు.

"అందుకే నీలో కొంత దురుసుతనమున్నా నీపై ఎనలేని వ్యామోహం."

నాకు భర్త పట్లవుండే ప్రేమకీ, వీడి వ్యామోహానికీ ఏమిటి సంబంధం? ఏమిటి వీడి పిండాకూడు వ్రాతలు? మోకాలికీ, బట్టతలకీ ముడెయ్యాలని చూస్తాదేం?

"ముప్పై ఏళ్ళుగా నీ అందాన్ని గమనిస్తూ వస్తున్నా. అది రోజు రోజుకూ కొత్త వన్నెలు విరజిమ్ముతూందేగాని వీసమెత్తయినా తగ్గినట్లు లేదు."

చాలాదూరం వచ్చిందే వ్యవహారం. వీడెవడో ఖచ్చితంగా ఈ వూరివాడే అయుంటాడు. మా వూరివాడైతే ముప్ఫయ్యేళ్ళేం కర్మ, యాభై ఏళ్ళనుండి చూస్తూ వుండేవాడేగా? అయినా యిదేమిటి వాడు పిసరంత పొగిడాడో లేదో సిగ్గు ముంచుకొస్తూంది. వీడమ్మ కడుపు మాడ. ఈ సచ్చినోడు నా మీద మత్తుజల్లటం లేదు కదా. అసలు వీడు ఏ నలభై ఏళ్ళవాడో? వదేళ్ళ గుంటడి కాణ్ణుంచే గుటకలు మింగుతూ కూర్చుని చచ్చాడేమో!

అవునూ— కోపంలో నేనిట్లా తెగతిట్టి పోస్తున్నాగాని వీడు అంత అసభ్యంగా ఏమీ వ్రాసినట్లు లేదే? ప్రేమలేఖలు అసభ్యంగా లేకుండా కూడా వుంటాయా? అయినా అవి మా ఇంటావంటా లేవాయె. అవి మాకెలా తెలిసేడుస్తాయి? అసభ్యంగా వున్నా. లేకపోయినా అసలు పరాయి ఆడదానికి ఉత్తరం రాయటమేమిటి?


"ఇన్నేళ్ళుగా నీకు ఈ విధంగా నా ప్రేమను ప్రకటించుకునే అదృష్టంకోసం యెదురుచూస్తూ కూర్చున్నా. అది యింతవరకు తలుపు తట్టలేదు. అందువలన నేడు నేనీ సాహసానికి పూనుకున్నా."

అమ్మ బాబోయ్ వీడెవడో యిన్నాళ్ళు బెబ్బులిలా పొంచి కూర్చున్నాడు కాబోలు. ఆయన్నలా వూరెళ్ళనిచ్చి యిలా గ్రంథం మొదలెట్టాడు. ఈ పీడ విరగడయ్యేదెలా?

"నాకు తెలుసు భర్త ప్రేమగా జాబు వ్రాస్తే ఏమాత్రం ప్రేమున్న భార్యయినా ప్రతి మాటా పదిమార్లు చదువుకుంటుందని."


అవును. చదువుకుంటుంది. ఎందుకు చదువుకోదు? భర్త వ్రాసిన ఉత్తరం భార్య ప్రేమగా చదువుకోటంలో తప్పేముంది. కొన్ని కొంపల్లో అదీ కుదిరి చావదు. భర్త వ్రాసిన ఉత్తరం కూడా దొంగతనంగా

తాళిలేదు తాళుమురా!



చదువుకు చావాల్సిందే. నా చిన్నతనంలో మా యింటి ప్రక్క మల్లికాంబ గోరింటాకనో, గోంగూరనో ఏదో వొంకతో మా యింటి కొచ్చి పెరట్లో కూర్చొని వాళ్ళాయన రంగూన్‌నుంచి వ్రాసిన ఉత్తరాలు ఎంత మురిసిపోతా చదువుకునేది. అప్పుడు నే ననుకునేదాన్ని పెద్దయ్యాక నాకూ అలా ఉత్తరాలు వస్తాయని. ఏదీ మేము వొకళ్ళ నొకళ్ళం విడిచి వుండమాయె. ఇంక ఉత్తరాలు వ్రాసుకునేదేముంది ? చదువుకుని సంతోషించేదేముంది.

"ఈ జాబు చూచి నీవేమనుకుంటావోనని భయంగా వుంది. కాని ఏం చేసేది? ఇన్నేళ్ళుగా జాబు వ్రాసే కోర్కెని అణచుకుంటూ వచ్చానుగాని నీకు ప్రేమగా ఒక్క జాబయినా వ్రాయకుండా తనువు చాలించే ఆలోచన అణచుకోలేకపోయాను. అందుకే



ఈ జాబు వ్రాసి పోస్టు చేస్తున్నా. మరి అధరామృతమే అందిస్తావో లేక అగ్ని వర్షమే కురిపిస్తావో!

ప్రేమతో
నీ ప్రియుడు"

అసలింతకూ ఈ ఉత్తరం నాదేనా? పక్కింటి లక్ష్మీకాంతానిది కాదుగదా. దాని ముఖానికి ప్రేమలేఖ కూడానా? చిడిముంజి ముఖం అదీనూ. మరి నాకెవరు వ్రాసుంటారు. ఇలాంటి ఉత్తరం ఆయన వ్రాసినా ఎంత మురిసిపోయేదాన్ని.... ఇదేమిటి మల్లికాంబ మళ్ళీ మళ్ళీ కళ్ళముందు కన్పిస్తూంది. ఈయన నాకో ఉత్తరం వ్రాస్తే బాగుండనిపిస్తూందేమిటి. ఛీ ఆయన్ని ఉత్తరం వ్రాయమని ఎలా అడగటం? అదీ ఈ వయసులోనా? ఆయనకు వేళాకోళంగా వుండదూ? అయినా అడగాల్సిందే. ఎలా అడగటం? పోనీ ఈ ఉత్తరం చూపెట్టి ఇలాంటి ఉత్తరం వ్రాయమని అడిగితే. అమ్మో ఇంకేమయినా వుందా, పాలలాంటి ఆయన మనస్సు ఈ ఉప్పుగల్లుతో విరిగిపోదూ? నాకు ప్రేమలేఖ వచ్చిందనే విషయం ఆయన భరించగలడా? ఈ ఉత్తరం దాచేస్తా. ఆయనకసలు ఈ ఉత్తరం వచ్చినట్లే చెప్పను. ఆయన యివ్వాళ ఎలాగూ వస్తారు. అల్లుడుగారు రాకుండా వుంటే బాగుండును. ఆయన్ని తిరిగి అమ్మాయి గారింటికి వెళ్ళి అల్లుడొచ్చే వరకూ వుండమని నాకో ఉత్తరం వ్రాయమని చెప్పేదానికి వీలుంటుంది.

ఇలా ఆలోచిస్తూ పడుకొన్న సూర్యకాంతమ్మకు కునుకుపట్టింది. మహేశ్వరం గారొచ్చి తలుపు తట్టటంతో మెలకువ వచ్చింది. ఉత్తరాన్ని దిండు గలీబులో దూర్చేసింది. వెళ్ళి తలుపుతీసింది. మహేశ్వరంగారొచ్చి మంచంమీద కూర్చొన్నారు.

"అమ్మాయీ.పిల్లలూ బాగున్నారాండీ?"

"ఆ! అంతా కులాసానే."

"అల్లుడుగారొచ్చేశారా?"

"లేదు. ఆయన మరో నాలుగురోజులు అక్కడే వుండవలసివస్తుందట. టెలిగ్రాం వచ్చింది."

"మరి యింతలోనే మీరొచ్చింది దేనికి?"

"నీతో ఇదే గొడవ. వచ్చినా తంటానే. రాకపోయినా తంటానే."

"అది కాదండీ. అమ్మాయి పిల్లల్తో ఒక్కతే ఎలా వుంటుందండీ. ఈ బస్సుకు వెంటనే బయలుదేరండి. అల్లుడుగారొచ్చే వరకు అక్కడే వుండండి. వెళ్ళగానే ఉత్తరం వ్రాయాలి సుమా. ఇదిగో ఇప్పుడే చిటికెలో కాఫీ పెట్టిస్తా" అంటూ అంత వయసున్నామె వంటింట్లోకి పరుగుపెట్టినట్లు వెళ్ళింది.

మహేశ్వరంగారు ఆలోచనలో పడ్డారు.. మరి తను వ్రాసిన ఉత్తరం మాటేమిటి? ఆమెకు చేరలేదా? చచ్చాం పో! ప్రక్కింటి వాళ్ళు ఓరుగంటివాళ్ళుకదా. నేను ఓ.కాంతమ్మ అని అడ్రసు వ్రాస్తే పోస్టుమన్ పక్కింటి లక్ష్మీకాంతమ్మకు ఇచ్చాడేమో కొంపదీసి. నేనయినా ఓగిరాల అని ఇంటిపేరు పూర్తిగా వ్రాస్తే పోయేది. ఏమోలే వ్రాసిన ఉత్తరం ఏమయితేనేం.ఇప్పుడు ఉత్తరం వ్రాయమని తానే కోరిందిగా—అదే పదివేలు. నేనింకా చిలిపిగా కూడా వ్రాయవచ్చు అనుకుంటూ మంచం మీద నడుం వాల్చారు.

తల క్రింద దిండు సరిజేసుకున్నారు. దిండులో ఏదో కాగితం వున్నట్లనిపించింది. తీసి చూశారు. ఏముంది—తను వ్రాసిన ఉత్తరమే! ఆహా! ఇది చదువుకునే మరో ఉత్తరం కావాలనుకుంటోంది కాబోలు.

నా జన్మ ధన్యమయింది. నా చిరకాల వాంఛ యీడేరింది.

అబ్బ!ఏమిటి ఉప్పెనలా ఈ ఆనందం? ఏమిటి ఈ ఉక్కిరి బిక్కిరి? ఏమిటి గుండె పట్టినటుంది.... అనుకుంటూ "ఇదిగో కాస్త మంచినీళ్ళు పట్రా" అని కేకేశారు. ●

## వ్యత్యాసం

ఆకాశంలో
రాబందు
ఎంతెత్తున ఎగిరినా
వెతికేది–
మృత కళేబరాలకోసమే....

తుమ్మెద
ఎంత దిగువనున్నా
గ్రోలేది,
సుమ–మకరందమే.

—పి. శ్రీనివాస్

ఆశ్చర్యకరమైన కోమలతకు ఓ అందమైన అనుభూతి

# రిమ్మల్

కోల్డ్ క్రీమ్ ● మేక్–అప్ క్రీమ్

రిమ్మల్ కోల్డ్‌క్రీమ్ మీ ముఖాన్ని మృదువుగా కాంతివంతంగా వుండేలా చేసి అధిక సౌందర్యాన్నిస్తుంది. రిమ్మల్ మేక్-అప్ క్రీమ్ మీ అందాన్ని నాలుగింతలు చేస్తుంది.




రిమ్మల్ రోజంతా అందంగా ఉండేలా చేస్తుంది

BONNE BELL COSMETICS
4, Cowie Lane,
CALCUTTA–700 016.